నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 8 నవంబర్ 2024 YADADRI BHUVANAGIRI

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లకు 27,446 దరఖాస్తులు

నల్లగొండ, నవంబర్ 7 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు దరఖాస్తుల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తంగా 27,446 మంది ఉపాధ్యాయులు ఓటుకు అప్లయ్ చేసుకున్నారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ చేపట్టారు. గతంలో ఓటు ఉన్నవారు కూడా మళ్లీ అప్లయ్ చేసుకోవాలని ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో అందరూ తిరిగి నమోదు చేసుకున్నారు. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5,333 మంది, అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలో 183 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2025 మార్చి29తో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం పూర్తవుతుంది.

| జిల్లా | దరఖాస్తులు |
|---|---|
| సిద్దిపేట | 183 |
| నల్లగొండ | 5,191 |
| సూర్యాపేట | 2,829 |
| యాదాద్రి భువనగిరి | 1,662 |
| జనగాం | 1,021 |
| మహబూబాబాద్ | 1,473 |
| వరంగల్ | 2,470 |
| హనుమకొండ | 5,333 |
| జయశంకర్ భూపాలపల్లి | 340 |
| భద్రాద్రి కొత్తగూడెం | 2,125 |
| ఖమ్మం | 4,174 |
| ములుగు | 645 |
| మొత్తం | 27446 |

# నేడే జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు.. అనంతరం సమీక్ష**

**అనంతరం మూసీ పునరుజ్జీవన యాత్రకు..**

**పైలాన్ ప్రారంభోత్సవం కార్యక్రమం రద్దు**

**కాళేశ్వరం జలాలు ప్రాజెక్ట్ కావడంతోనే నా?**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, అధికారులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, సీఎం టూర్‌లో మల్లన్నసాగర్ నుంచి కాళేశ్వరం జలాల తరలింపులో భాగంగా ముందుగా నిర్ణయించిన పైలాన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని రద్దు చేయడం చర్చనీయాంశంగా మారింది.

*– యాదాద్రి భువనగిరి, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ)*



యాదగిరిగుట్టలో హెలిప్యాడ్ వద్ద తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

### పర్యటన ఇలా..

సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఉదయం 9.20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా యాదగిరిగుట్టకు చేరుకుంటారు. 9.30 నుంచి 10 గంటల వరకు ప్రెసిడెన్షియల్ సూట్‌లో గడుపుతారు. తన జన్మదినం సందర్భంగా 10.05గంటల నుంచి 11.15గంటలకు ప్రధానాలయంలో స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఒంటి గంట వరకు యాదగిరిగుట్ట అభివృద్ధిపై వైటీడీఏ, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్న భోజనం తర్వాత ఒకటిన్నరకు అక్కడి నుంచి బయల్దేరి రోడ్డు మార్గంలో రెండు గంటకు వలిగొండ మండలం సంగెం గ్రామానికి చేరుకుని, మూసీ పునరుజ్జీవన యాత్రను ప్రారంభిస్తారు. 3గంటల నుంచి 5 గంటల వరకు మూసీ పరివాహక ప్రాంతంలో భీమలింగం, ధర్మారెడ్డి కాల్వ వరకు పాదయాత్ర చేస్తారు. ఆ తర్వాత నాగిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డుకు చేరుకుని ఓపెన్ టాప్ జీపుపై ప్రసంగిస్తారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరుతారు.

### సర్వం సిద్ధం..

సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. యాదగిరిగుట్టలో హెలీప్యాడ్ ఏర్పాటుచేశారు. సంగెం వద్ద ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి రోడ్డును చదును చేశారు. కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం ఆయా పనులను పరిశీలించారు. వారి వెంట ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఉన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు సుమారు 20వేల మందిని తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తున్నది.

### పైలాన్ ప్రారంభోత్సవం రద్దు..

సీఎం టూర్‌లో భాగంగా యాదగిరిగుట్టలో మిషన్ భగీరథ పైలాన్ ప్రారంభోత్స కార్యక్రమం రద్దు చేయడం చర్చనీయాంశంగా మారింది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు మంచి నీటి సరఫరా కోసం నిర్మించనున్న పైప్‌లైన్ ప్రాజెక్ట్ పైలాన్‌ను యాదగిరిగుట్టలో రేవంత్‌రెడ్డి ప్రారంభించాల్సి ఉంది. పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేయాలి. దీని ద్వారా 550కి పైగా గ్రామాలకు తాగునీరు అందించనున్నారు. ఇందుకోసం రూ.210 కోట్లు మంజూరు చేశారు. కానీ, షెడ్యూల్ నుంచి పైలాన్ కార్యక్రమాన్ని తొలగించారు. మలన్నసాగర్ నుంచి జిల్లాకు తరలించాలనుకున్న జలాలన్నీ కాళేశ్వరం నుంచే వస్తున్నాయి. ఇటీవలి వరకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు, మంత్రులు, కాంగ్రెస్ నేతలు కాళేశ్వరంపై అడ్డగోలు వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు అవే నీళ్ల సరఫరాకు శంకుస్థాపన చేయాల్సి ఉండడంతో ఏమనుకున్నారో ఏమో ఆఖరి నిమిషంలో కార్యక్రమం రద్దు చేశారు.

### పటిష్ట పోలీస్ బందోబస్తు..

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు యాదగిరిగుట్టతోపాటు వలిగొండ మండలంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రాజేశ్ చంద్ర ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం సందర్శించే ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి. సుమారు 2వేల మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి సీఎం పర్యటన ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.

# మిగిలిన పనులకు మోక్షం కలిగేనా?

## యాదగిరిగుట్ట అభివృద్ధికి ఈసారైనా నిధులిచ్చేనా?

## కాంగ్రెస్ పాలనలో రూపాయి ఇచ్చింది లేదు

- పెండింగ్‌లో ఎంట్రీ ప్లై ఓవర్ నిర్మాణం, కొండ కింద నిత్యాన్నదానం, దేవస్థానం బస్టాండ్
- తుర్కపల్లి, రాజాపేట, వంగపల్లి నాలుగు లైన్ల రోడ్ల కోసం ఎదురుచూపులు
- గండి చెరువులో తెప్పోత్సవం ఎప్పటికో!
- విమానగోపురం స్వర్ణతాపడం విరాళాలపైనా స్పష్టత కరువు
- నేడు యాదగిరిగుట్టకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 7 : భక్తుల కొంగు బంగారమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం బీఆర్‌ఎస్ సర్కారులో ఇల వైకుంఠాన్ని తలపించేలా పున్నర్నిర్మాణం చేసుకున్నది. ఆధ్యాత్మిక ప్రపంచం అబ్బురపడేలా రూ.1,300 కోట్లతో ఆలయాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మహాద్భుతంగా తీర్చిదిద్దారు. అనేక వసతులను అందుబాటులోకి తీసుకువచ్చారు. మిగిలిన పనుల్లో కొన్ని పురోగతిలో ఉండగా, మరికొన్ని చేపట్టాల్సి ఉన్నది. ఇంతలో ప్రభుత్వం మారగా.. యాదగిరిగుట్ట అభివృద్ధి ఆశించిన మేర ముందుకు పడడం లేదు. ఈ ఏడాది మార్చి 11న స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సీఎం హోదాలో తొలిసారిగా హాజరైన రేవంత్‌రెడ్డి.. లక్ష్మీనరసింహుడిని దర్శించుకుని వెళ్లారే తప్ప.. అభివృద్ధిపై ఒక్క మాటైనా మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరికి వస్తున్నా యాదగిరిగుట్ట దేవస్థానానికి ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు గుట్టకు వస్తున్నారు. ఈసారైనా యాదగిరిగుట్ట క్షేత్రాభివృద్ధికి అవసరమైన నిధులు, ఇప్పటికే పురోగతిలో ఉన్న పనుల పూర్తిపై స్పందించాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఎంట్రీ ప్లైఓవర్, ఫోర్ లేన్ రోడ్లు, తెప్పోత్సవం, నిత్యాన్నదానం, దేవస్థానం బస్టాండ్, టెంపుల్ సిటీపై డోనర్ కాటేజీల నిర్మాణం వంటి పనులపై దృష్టి సారించాల్సి ఉంది.



యాదగిరిగుట్ట దేవస్థానం

### పెండింగ్‌లోనే నెట్‌వర్క్ బ్రిడ్జి

గత ప్రభుత్వ హయాంలోనే 69 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కొండపైకి వెళ్లేందుకు, కొండ కిందికి దిగేందుకు ఎగ్జిట్, ఎంట్రీ ప్లైఓవర్‌ను ప్రతిపాదించగా.. అప్పట్లోనే ఎగ్జిట్ ప్లైఓవర్ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. కొండ కింద వైకుంఠ ద్వారం సమీపంలో గల ఆర్య వైశ్య సత్రం నుంచి ఎంట్రీ ప్లై ఓవర్ కోసం నెట్ వర్క్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టారు. 12 మీటర్ల వెడల్పు, 445 మీటర్ల పొడవుతో మొదటి ఘాట్‌రోడ్డు పాత నిత్యాన్నదాన భవనం వరకు దీన్ని అనుసంధానం చేశారు. దీని దగ్గర 64 మీటర్ల పొడవుతో ఆర్చ్ బ్రిడ్జి రానున్నది. ఇందులో 7 ఫిలర్లు, 32 మీటర్ల మేర నిర్మాణం పూర్తయ్యాయి. లండన్ నుంచి దిగుమతి చేసుకున్న నెట్ వర్క్ ఆర్చ్ బ్రిడ్జిని బిగించాల్సి ఉంది. రూ.69కోట్లలో రూ.34కోట్లు మంజూరు చేయగా రూ.20కోట్లు ఖర్చు చేశారు. మరో రూ. 14 కోట్లు కావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిధుల్లేక బ్రిడ్జి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

### తెప్పోత్సవం సంగతేంటి?

కొండ కింద గండి చెరువు సుందీకరణతోపాటు తెప్పోత్సవం నిర్వహించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం యోచించింది. అందుకోసం రూ.33.07 కోట్లు మంజూరు చేసింది. రూ.20 కోట్లు వెచ్చించి దాదాపు 60 శాతం పనులను పూర్తి చేసింది. మరో రూ.13.07 కోట్లు అవసరం. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే స్వామివారి తెప్పోత్సవం, లేజర్ షో, ప్రధాన ప్రవేశ ద్వారం, ఫౌంటేన్, ఆంపీ థియేటర్ వంటి చేపట్టాల్సి ఉంది. ప్రధానంగా ఆలయ చరిత్రలో తొలిసారి స్వామివారి తెప్పోత్సవం కార్యక్రమాన్ని గండిచెరువులో చేసేందుకు గత ప్రభుత్వం నిశ్చయించగా, కాంగ్రెస్ సర్కారు మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు.

### టెంపుల్ సిటీపై ముందుకు సాగని డోనర్ కాటేజీల నిర్మాణాలు

యాదగిరిగుట్ట దేవస్థానానికి వచ్చే భక్తులు ఆహ్లాదభరిత వాతావరణంలో గడపాలన్న ఉద్దేశంతో స్వామివారి కొండకు పశ్చిమ దిశలో టెంపుల్ సిటీని నిర్మించారు. సకల వసతులు, గార్డెనింగ్, చెట్లు, మంచి నీటి, విద్యుత్ సౌకర్యాలతోపాటు హెలిప్యాడ్‌ను నిర్మించారు. 1000 గజాల్లో 250 డోనర్ కాటేజీలను నిర్మించాలని సంకల్పించి, ఇందుకు కావాల్సిన స్థలాన్ని చదును చేసి సిద్ధం చేశారు. పలువురు దాతలు కాటేజీలు నిర్మించేందుకు సిద్ధంగా ఉండగా, ఆ పనులపై దృష్టి సారించాల్సి ఉంది.

### రాజాపేట నుంచి చేర్యాల ఫోర్ లేన్ రోడ్డు..

స్వామివారి క్షేత్రానికి నలుమూల నుంచి వచ్చే భక్తులకు రహదారి సమస్యలు తలెత్త వద్దని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా తుర్కపల్లి నుంచి యాదగిరిగుట్టకు ఫోర్‌లేన్ బీటీ రోడ్డు వేసింది. ఆ నిర్మాణం దాదాపుగా పూర్తి కాగా, మల్లాపురం బైపాస్ నుంచి పట్టణంలోని గండిచెరువు వరకు 2 కిలో మీటర్ల మేర మాత్రం పెండింగ్‌లో ఉంది. రూ.290కోట్లతో యాదగిరిగుట్ట నుంచి రాజాపేట మీదుగా చేర్యాల వరకు సుమారు 37 కిలో మీటర్లు, యాదగిరిగుట్ట నుంచి వంగపల్లి వరకు సుమారు 5 కిలో మీటర్ల ఫోర్‌లేన్ బీటీ రోడ్డును గత ప్రభుత్వం ప్రతిపాదించగా డీపీఆర్ కాలేదు. ఈ రోడ్డు పనులను కూడా ప్రభుత్వం చేపట్టాల్సి ఉంది.

### ప్రారంభానికి నోచని మినీ శిల్పారామం

యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో భాగంగా వైటీడీఏ నిధులతో ఎకరన్నరలో మినీ శిల్పారాయం ఏర్పాటుచేశారు. స్వాగత తోరణం, పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేద తీరేందుకు మైదానం సిద్ధం చేశారు. రాత్రివేళల్లో పరిసరాలన్నీ జిగేల్ అనిపించేలా రాయగిరి ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. శిల్ప, హస్తకళా వైభవం ఉట్టిపడే విధంగా రాయగిరి చెరువు ప్రాంతానికి మెరుగులు అద్దారు. ఆ పనులన్నీ పూర్తయినా కాంగ్రెస్ సర్కారులో మినీ శిల్పారామం ప్రారంభానికి నోచడం లేదు. దాంతో శిల్పారామంలో ఏర్పాటుచేసిన ఆట వస్తువులు, ఫుడ్ కోర్టులు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి.

### స్వర్ణతాపడం విరాళాలపై స్పష్టత కరువు

స్వామివారి ఆలయ దివ్య విమానగోపురం బంగారుమయం చేయాలన్న లక్ష్యంతో మాజీ సీఎం కేసీఆర్ 2022 ఫిబ్రవరి 11న కీలక ప్రకటన చేశారు. స్వర్ణతాపడంలో ప్రజా భాగస్వామ్యం ఉండాలని సంకల్పించి తమకు తోచిన విరాళం అందించవచ్చని పిలుపునిచ్చారు. దాంతో గత బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యే, అధికారులు, వ్యాపారులు భారీగా విరాళాలు అందజేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 30న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు లక్ష్మీనరసింహుడిని దర్శించుకుని కిలో 16 తులాల బంగారానికి సంబంధించి రూ.52,48,097 చెక్కును అందజేశారు. ఇలా.. మొత్తం దాదాపు వంద కిలోల బంగారం స్వామివారి స్వర్ణతాపడానికి సమకూరింది. ఈఓ భాస్కర్‌రావు మాత్రం 10 కిలోల 500 గ్రాముల బంగారం, రూ.20కోట్ల నగదు సమకూరిందని వెల్లడించారు. మిగతా బంగారం నిమిత్తం స్వామివారి హుండీకి సమకూరిన బంగారం, వెండిని వినియోగించి 65 కిలోల బంగారం వినియోగించి స్వర్ణతాపడం పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గతంలో సమకూరిన విరాళాల వివరాలను వెల్లడించాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

# కొండపై వసూళ్ల దుకాణం

- కాంగ్రెస్ ప్రజాప్రతినిధి చేతివాటం
- షాపులకు అనుమతి ఇప్పిస్తానంటూ లంచావతారం
- 15 దుకాణాలకు రూ. 70లక్షల ముడుపులు!
- మరో రూ.కోటిన్నర కోసం కొత్త ఎత్తులు



యాదగిరిగుట్ట కొండపైన ప్రస్తుతం ఉన్న దుకాణాలు

యాదగిరిగుట్ట, నవంబర్ 7 : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్ట కొండపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధి వసూళ్ల పర్వానికి తెర లేపాడు. గుట్టపైన కొత్తగా దుకాణాలకు అనుమతి ఇప్పిస్తానంటూ అందినకాడికి దండుకుంటున్నాడు. ఈ దందాలో మొదట 50 లక్షలు.. ఆ తర్వాత మరో రూ.70లక్షల వరకూ చేతులు మారినట్లు తెలుస్తున్నది. చాలదన్నట్లుగా దుకాణాల్లో తనవారికి మూడు షాపులు ఇవ్వాలని కొత్త కిరికిరి పెట్టినట్లు ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు యాదగిరిగుట్టలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం కొండపైన పూర్వం నుంచే 115 దుకాణాలు నడిచేవి. ఇందులో కొన్ని టెండర్ల ద్వారా రాగా, మరికొన్ని కమిషనర్లు ఆర్డర్లు ఇచ్చారు. దుకాణదారులంతా సంఘంగా ఏర్పాటై విక్రయాలు సాగించేవారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని అత్యద్భుతంగా పునర్నిర్మించాలని రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించిన క్రమంలో కొండపైన ఉన్న దుకాణాలను తొలగించారు. అనంతరం కొండపైన సరిపడా స్థలం లేకపోవడం భక్తులు ఇబ్బందులు పడుతారని భావించి కొండపైన దుకాణ సముదాయం నిర్మించలేదు. దుకాణదారుల కోరిక మేరకు 10 దుకాణాలకు అనుమతినిచ్చి భక్తుల షాపింగ్‌కు వీలు కల్పించారు. ప్రస్తుతం 10 దుకాణాల నుంచి వచ్చే ఆదాయాన్ని మొత్తం మంది సమానంగా పంచుకుంటున్నారు.

### 15 దుకాణాలు.. రూ.70లక్షలు!

గుట్టపై మరో 15 షాపులకు కొత్తగా అనుమతులు ఇప్పిస్తానంటూ జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఒకరు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకోసం ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున ఇవ్వాలని కండీషన్ పెట్టారట! కొత్త దుకాణాలు వస్తే ఆదాయం పెరుగుతుందని ఆశపడ్డ వ్యాపారులు అంతా కలిసి రూ.70లక్షల వరకు జమ చేసి, సదరు నేతకు అప్పగించినట్లు తెలుస్తున్నది.

### రూ. కోటిన్నర కోసం.. కొత్త కొర్రీ..!

డబ్బులు పోయినా దుకాణాలు వస్తే ఫాయిదా ఉంటుందని భావించిన వ్యాపారులకు ఇప్పుడు కొత్త చిక్కు వచ్చి పడింది. తొలుత 15 దుకాణాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధి.. ఇప్పుడు 12 దుకాణాలు మాత్రమే ఇప్పిస్తానని, మిగిలిన మూడు దుకాణాలు తన వారికి ఇవ్వాలని షరతు పెట్టారని వ్యాపారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ముందు అన్నీ మాట్లాడాకే డబ్బులిచ్చాం కదా. ఇప్పుడు 3 షాపులకు కోత పెట్టడమేంటి? ఇదెక్కడి న్యాయం' అంటూ రుసరుసలాడుతున్నారు. ఇదిలా ఉండగా, సదరు నేత ఆ 3 దుకాణాలను సైతం రూ.50లక్షల చొప్పున రూ.కోటిన్నర కోసం బేరం మాట్లాడుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దుకాణాల అనుమతికి సంబంధించిన ఫైల్ దేవాదాయ శాఖకు చేరిందని తెలిసింది. అన్నీ అనుకూలిస్తే అనుమతి లభించే అవకాశం లభించనుంది. మరోవైపు ఈ వ్యవహారాన్ని అఖిల పక్షం నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. టెండర్ల ద్వారా దుకాణాలు కేటాయించకపోతే కార్యాచరణ రూపొందించి పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### టెండర్ల ద్వారా షాపులు కేటాయించాలి

కొండపైన కొత్తగా మరో 15 దుకాణాలు కేటాయిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంట్లో స్థానికంగా భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. టెండర్లు లేకుండా ఇష్టారాజ్యంగా దుకాణాలు కేటాయింపు జరుగుతుందని స్థానికుల్లో అనుమానం ఉంది. టెండర్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా దుకాణాలు కేటాయించాలి.

*– కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి*



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆజాంబాబ

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఉమ్మడి జిల్లా విద్యార్థులు

కోదాడ రూరల్, నవంబర్ 7 : ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు రంగారెడ్డి జిల్లా మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కోదాడ పట్టణ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఎస్‌జీఎఫ్ 68వ క్రీడోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 బాల, బాలికలకు గురువారం చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 167 మంది పాల్గొనగా 20 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ.ఆజాంబాబ తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మాజీ రాష్ట్ర నాయకుడు బొల్లు రాంబాబు, ఓరుగంటి రవి, పారుపల్లి చంద్రశేఖర్, నరసింహారావు, పీడీ ప్రకాశ్, జి.రవి, సునీత ప్రభాకర్, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.



వన సందర్శన కార్యక్రమంలో పాల్గొన్న రాయగిరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

## విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను తెలియజేయాలి

- వైటీడీఏ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాజియ

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 7 : విద్యార్థి దశ నుంచే అడవుల ప్రాముఖ్యతను తెలియజేసి, పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వామ్యం చేయాలని వైటీడీఏ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాజియ అన్నారు. వన సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల, జీనియస్ స్కూల్ విద్యార్థులను ఫారెస్ట్ జిల్లా రేంజ్ ఆఫీసర్స్, నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అడువులకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాయగిరి, వడాయిగూడెం గ్రామాల పరిధిలోని నారసింహ, ఆంజనేయ అరణ్యాలు, నర్సరీలను సందర్శింపజేసి వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భువనగిరి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేశ్ నాయక్, నవభారత్ యూత్ అధ్యక్షుడు సరగడ కరుణ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



అప్పాజిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధర్నా చేస్తున్న రైతులు

నల్లగొండ రూరల్, నవంబర్ 7 : మండలంలోని అప్పాజిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం ఐకేపీ కేంద్రంలో కొనుగోళ్లు జరుపడం లేదని రైతులు గురువారం ధర్నా చేశారు. సీపీఎం మండల నాయకుడు పోలె సత్యనారాయణ ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ కేంద్రాల్లో ధాన్యం పోసి ఇప్పటికే రెండు నెలలు పూర్తి కావస్తున్నా కొనుగోళ్లు జరుపడం లేదని మండి పడ్డారు. అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిసి ముద్దవుతుందని, వాటిని ఆరబెట్టినా కొనే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక మద్దతు ధర లేకున్నా పరవాలేదని, ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారన్నారు. ప్రజా పాలన పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు పందుల భిక్షం, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అచ్చాలు, యాదమ్మ, వెంకటమ్మ, పార్వతమ్మ, సునీత, వెంకటమ్మ, మణికుమార్, రామలింగయ్య, గంగయ్య, గుండాల యాదయ్య పాల్గొన్నారు.